క్లుప్తంగా

వ్యర్థాలతో అలంకరణ వస్తువుల తయారీ


శెట్టూరు కేజీబీవీలో న్యూస్ పేపర్స్‌తో తయారు చేసిన అలంకరణ వస్తువులు

శెట్టూరు: స్థానిక కేజీబీవీలోని విద్యార్థినులు వ్యర్థాలు, పాత న్యూస్ పేపర్లతో ఇంటి అలంకరణ వస్తువులు తయారు చేసి, పాఠశాలను అలంకరించారు. శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వ్యాసురావు, డిజిటల్ అసిస్టెంట్ నాగరాజు, ఐకేపీ సిబ్బంది, యానిమేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న చలో కలెక్టరేట్

కళ్యాణదుర్గం రూరల్: సివిల్ సప్లై హమాలీ కూలీల సమస్యలపై ఈ నెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం 'చలో కలెక్టరేట్' కరపత్రాలను విడుదల చేశారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

బొమ్మనహాళ్: ప్రజలందరినీ చైతన్యవంతుల్ని చేసి, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రీడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ హైస్కూల్‌లో జిల్లా ఎయిడ్స్ నివారణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రీడ్స్ సిబ్బంది సావిత్రి, గంగమ్మ, ఎర్రిస్వామి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రేబిస్ టీకా వేయించాలి

- పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్

ఉరవకొండ: కుక్కలు, కోతులు ఇతర పెంపుడు జంతువుల నుంచి మనుషులకు రేబిస్ వ్యాధి సోకకుండా రేబిస్ టీకా వేయించాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు జంతువులకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

లక్ష్యం నిర్దేశించుకోవాలి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా సూచించారు. శుక్రవారం స్థానిక మహాత్మా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మహాత్మా కళాశాల గౌరవ సలహాదారు షాషావలి, కరస్పాండెంట్ షాజహాన్, అధ్యాపకులు సంపత్‌కుమార్, ఉషోదయ స్కూల్ హెచ్ఎం జయప్రకాష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బోయ హనుమక్క మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ దుర్గన్న భార్య బోయ హనుమక్క అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం సమన్వయ కర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య హనుమక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను రంగయ్య పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయుడు గోవర్దన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుందుర్పి: మండలంలోని వడ్డేపాళ్యం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోవర్దన్‌ను ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈనెల 5న ఉపాధ్యాయుడు గోవర్దన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. వక్తలు మాట్లాడుతూ గోవర్దన్ ఉపాధ్యాయుడిగా చేస్తున్న సేవలను గుర్తు చేశారు. ఈసందర్భంగా వారు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీసీ తిమ్మప్ప, బొమ్మయ్య, ఈరప్ప, నాయకులు మంజునాథ్, రామకృష్ణ, సునీత, పద్మావతి, హమీద, వాణి తదితరులు పాల్గొన్నారు.

నీరు వృథా..తప్పదు వ్యథ

- మరమ్మతుకు గురవుతున్న గేట్ వాల్వ్‌లు
- రోజూ 70 వేల లీటర్ల తాగునీరు వృథా
- పలుచోట్ల దెబ్బతిన్న పైప్‌లైన్లు
- పంటకాలువను తలపిస్తున్న నీటి ప్రవాహం

రాయదుర్గం: బొట్టు బొట్టూ ఒడిసి పడితే గుక్కెడు దాహం తీరుతుంది.. ధారలా వృథా అయ్యే నీరు..ప్రవాహంలా మారి ఎద్దడికి దారి తీస్తుంది. బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తిస్తే.. కన్నీటి కష్టాలను తీర్చొచ్చు. మూడు నెలల నుంచి తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో తాగునీటి పథకాల పైపులైన్లు లీకేజీలు అధికమయ్యాయి. అనేక చోట్ల గేట్ వాల్వ్‌లు పైపులైన్లు దెబ్బతినడంతో నీరు వృథా అవుతోంది. రోడ్లు, రహదారులపై నీటి ప్రవాహంలా కనిపిస్తోంది. అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోలేదు. కొందరు కూటమి నేతల ఆధిపత్యం అధికమై, సమస్య తలెత్తుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. రాయదుర్గంలోని 32 వార్డులు 75 వేల మంది జనాభా ఉన్నారు. వీరందరి దాహం కష్టాలు తీర్చే ఏకైక నీటి పథకం వైఎస్సార్ పథకం. మరో 85 పవర్‌బోర్లు, 5 చేతి బోర్లు ఉన్నాయి. వీటితో 11,298 వ్యక్తిగత కుళాయిలు కనెక్షన్లు, 150 పబ్లిక్ ట్యాప్‌లకు నీరందుతోంది. వైఎస్సార్‌నీటి పథకం ద్వారా రోజు విడిచి రోజూ నీటి సరఫరా అవుతోంది. పట్టణంలోని మారెమ్మగుడి, హౌసింగ్ కార్యాలయం ఏరియా, శాంతినగర్, కొతిగుట్ట, కణేకల్లు రోడ్డు తదితర ప్రాంతాల్లో నీటి లీకేజీలు కనిపిస్తున్నాయి. వీటి ద్వారా నిత్యం 70 వేల లీటర్ల తాగునీరు వృథా అవుతున్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

శ్రీరామరెడ్డి నీటి పథకం నిర్వహణ అధ్వానం..

పట్టణం మీదుగా రాయదుర్గం మండలం ఉడేగోళంకు శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా సరఫరా జరిగే ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన హైర్ గేట్‌వాల్వ్ భంభంస్వామి ఆశ్రమం ముందు దెబ్బతింది. సుమారు ఒకటిన్నర ఇంచు నీరు ఆ ప్రాంతంలో వృథాగాపోతోంది. దీంతో దారి కాస్త పంట కాలవగా మారింది. ఇళ్లమధ్య నీరు నిల్వ ఉండి, దోమలకు ఆవాసంగా మారింది. అపరిశుభ్రత నెలకొని, దుర్వాసన వస్తోంది. ప్రజల దాహార్తి తీర్చే నీరు ఇలా వృథా అవుతుండడంతో అనారోగ్యంబారిన పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


భంభంస్వామి ఆశ్రమం సమీపంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం వాల్వ్ వద్ద నీటి లీకేజీ

వార్డుల్లో కూటమి నేతల ఆధిపత్యం ..

పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో తాగునీరు లీకేజీ అవుతోంది. కణేకల్లు సమ్మర్‌స్టోరేజీ నుంచి నిత్యం పట్టణానికి 9 ఎంఎల్‌డీల తాగునీరు పంపింగ్ జరుగుతోంది. వాటిని ప్రధాన ఓహెచ్ఆర్‌లలో నిల్వచేసి, అక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. చాటాచోట్ల గేట్‌వాల్వ్‌లు, పైప్‌లైన్లు దెబ్బతినడంతో నీటి లీకేజీలు అధికమయ్యాయి. ఆ ప్రాంతాల్లో మురుగునీటి గుంతలు ఏర్పడి, అపరిశుభ్రత నెలకొంది. వార్డుల్లో కూటమి నేతలు కొందరు ఆధిపత్యంతో అధికారం మాది అంటే.. మాదేనన్నట్టు ప్రవర్తిస్తున్నారు. తాగునీటి సరఫరా విషయంలోనూ తాముచెప్పినట్టే నడుచుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు.


మారెమ్మ ఆలయ సమీపంలో లీకేజీ అవుతున్న మెయిన్ పైపులైన్

రాయదుర్గం మున్సిపాలిటీలో తాగునీటి పథకాలు - నీటి సరఫరా వివరాలు

వార్డులు	32
జనాభా	75 వేలు
తాగునీటి పథకం	వైఎస్సార్ నీటి పథకం
పవర్ బోర్లు	85
చేతిబోర్లు	5
వ్యక్తిగత కుళాయిలు	11,298
వీధి కుళాయిలు	150
రోజూ నీటిసరఫరా	9 ఎంఎల్‌డీలు
పంపిణీ లైన్లు	100 కిలో మీటర్లు

మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం



పట్టణంలో నీటి లీకేజీలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తాం. వాటి మరమ్మతులకు సత్వరం ఆదేశాలు జారీ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపడతాం. సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తాం. శ్రీరామరెడ్డి తాగునీటి వృథాను అరికట్టేలా కృషి చేస్తామని డీఈ శ్రీనివాసులు తెలిపారు.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం



హౌసింగ్ కార్యాలయం సమీపంలో వృథా అవుతున్న నీరు

అధికార పార్టీ పాపాల ప్రక్షాళనకు పూజలు

- మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని కూటమి ప్రభుత్వం విమర్శలు చేయడం తగదని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు.పట్టణంలోని స్థానిక వెంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నేతలతో కలిసి కార్యక్రమంపై చర్చించారు. అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఆలయాల్లో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు సరోజా కాంపౌండ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై, కొల్లాపురమ్మ గుడి, టీసర్కిల్ మీదుగా బళ్లారి మిట్ట నుంచి ఆర్డీటీ కార్యాలయం ఎదురుగా ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు సాగుతుందన్నారు. మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కో ఆప్షన్ అప్జల్, నాయకులు గోళ్ల సూరి, శ్రీకాంత్‌రెడ్డి, గణేష్, యర్రంపల్లి కృష్ణమూర్తి, నరసింహులు, శ్రీకాంత్, షేక్షావలి, హరి, నటరాజ్, జానీ పాల్గొన్నారు.


పార్టీ నాయకులతో చర్చిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

పూజలకు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



రాయదుర్గం: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూపై సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేయడం తగదని, కూటమి ప్రభుత్వ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఆలయాల్లో శనివారం పూజలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులను చూరగొన్న మహిమా న్వితుడు వెంకటేశ్వరుడన్నారు. అంతటి ప్రసిద్ధి చెందిన దేవుడిపై రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. ఆ దేవదేవుడి పవిత్రతను, ప్రసాదం విశిష్టతను అపహాస్యం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ పాపాన్ని ప్రక్షాళన చేసి, నిజాన్ని ప్రజలకు చాటి చెప్పాలనే ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం శ్రీవారి ఆలయ సందర్శనకు వస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. పార్టీ అధినేత పిలుపు మేరకు శనివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణుడి ఆలయంలో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని డి హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాల్లోనూ పార్టీ నాయకులు ఆలయాల్లో పూజలు నిర్వహించాలని సూచించారు.

స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

రాయదుర్గంటౌన్: స్వచ్ఛ రాయదుర్గం..స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, హెచ్ఎం జయప్రద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.


స్వచ్ఛతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బొమ్మనహాళ్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం ఉద్దేహాళ్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన, శశికల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే భావితరాలకు మనుగడ

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే భావితరాలకు మనుగడ ఉంటుందని తహసీల్దార్ మునివేలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణలో 50 రకాల పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్‌డీ దాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ , అధ్యాపకులు సుబ్బరాయుడు, హనుమంత నాయక్, ఆదిరాముడు, శంకర్, వరలక్ష్మీ, స్వప్న, పవిత్ర, భూపతి, సులోచన, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం: రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్‌గా కుంచపు శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి దాకా ఇక్కడ పనిచేస్తున్న వీ శ్రీనివాసులు కదిరికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కే శ్రీనివాసులు మాట్లాడారు. కర్నూలు జిల్లా నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా రాయదుర్గానికి వచ్చినట్టు తెలిపారు. గతంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇతర క్రయ,విక్రయాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. అవినీతికి ఆస్కారంలేకుండా పనిచేస్తామన్నారు. అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా వి.సుచరిత బాధ్యతలు చేపట్టారు. వీరికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు


ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ హనుమనాయక్

ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్‌గా హనుమనాయక్

ఉరవకొండ: ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్‌గా హనుమనాయక్ బాధ్యతలు స్వీకరించారు. యాడికి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న హనుమనాయక్ శుక్రవారం బదిలీపై ఉరవకొండకు వచ్చారు. సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన హనుమనాయక్‌కు డాక్యుమెంట్ రైటర్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమనాయక్ మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో సేవలు అందిస్తామన్నారు. గతంలో ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు.

సంక్షిప్త సమాచారం

30లోపు దరఖాస్తు చేసుకోండి

వజ్రకరూరు: సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ - 2 తిమ్మప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సార్వత్రిక విద్యా పీఠం ప్రవేశాల బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఎంఈఓ ఎర్రిస్వామి-1 ,సీఆర్‌పీలు, ఎం ఐఎస్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

కంబదూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు నాగరాజు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల పోస్టర్లను విడుదల చేశారు.

ఉరవకొండ డీటీగా బోగన్న గౌడ్

ఉరవకొండ: ఉరవకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా బోగన్నగౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కళ్యాణదుర్గం రీసర్వే డీటీగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఉరవకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న హరిప్రసాద్ రాప్తాడు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా బదిలీ అయ్యారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

బెళుగుప్ప: కాలువపల్లి సమీపంలోని పెన్నా పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తుండగా ఐదు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న వారు ఆత్మకూరుకు చెందిన నాలుగు ట్రాక్టర్లు, అనంతపురానికి చెందిన ఒక ట్రాక్టర్లను పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించండి

బ్రహ్మసముద్రం: రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని పీఏసీ పర్సన్ ఇన్‌చార్జ్ మారుతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భైరవానితిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార సంఘం సిబ్బంది, రైతులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేయాలని సూచించినట్లు తెలిపారు.

ఉలవలు పంపిణీ

కంబదూరు: మండలంలోని తిమ్మాపురంలో వ్యవసాయాధికారి జాఫర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉలవలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైపరీత్యాల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనం విత్తని రైతులు ఉలవలు విత్తుకొని మంచి దిగుబడులు సాధించుకోవాలని ఏఓ సూచించారు. మేకలు, గొర్రెలు, పశువులు ఉన్న రైతులకు ఉలవ పంట ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పొలాల్లోనే తడిసిన వేరుశనగ పంట


జంబుగుంపల సమీపంలో పొలంలోనే కుళ్లిన వేరుశనగ పంట

కుందుర్పి: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న జడివానకు పొలాల్లోనే వేరుశనగ పంట తడిసిపోయింది. మండల వ్యాప్తంగా గత జూన్ మాసంలో బోరుబావుల కింద సుమారు 4 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. వారం రోజులుగా పంట తొలగిస్తున్నారు. అనుకోకుండా వర్షాలు పడుతుండడంతో తొలగించిన వేరుశనగ పొలాల్లోనే తడిసి పోయిందని జంబుగుంపల, ఎర్రగుంట, బసాపురం, నిజవల్లి తదితర పంచాయతీల రైతులు వాపోయారు.

1,400 ఓటర్లకు పోలింగ్ బూత్

రాయదుర్గం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1,400 ఓట్లకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేసేలా కార్యచరణ చేపట్టామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో 296 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటరుగా నమోదు అయితే, 1400 ఓట్లు దాటిన చోటంతా పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

శెట్టూరు: మండలంలోని కైరేవు గ్రామానికి చెందిన మహేష్ ఇటీవల కేన్సర్‌తో మృతిచెందాడు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ ద్వారా ఓ ఎన్ఆర్ఐ రూ.2లక్షలు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం కై రేవు గ్రామంలో మహేష్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.2 లక్షలు మహేష్ కుమార్తె జాహ్నవి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెస్ రాయుడు, ట్రస్ట్ సభ్యులు ములకలేడు సాయి నాథ్, అబ్దుల్ వాహబ్ ఖాన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో పూజలు

వజ్రకరూరు: కడమలకుంట గ్రామంలో సుంకులమ్మ అవ్వ ఆలయంలో శుక్రవారం పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు ఆకు పూజ , మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మోస్తరు వర్షం

రాయదుర్గంటౌన్: పట్టణంలో శుక్రవారం సాయంత్రం అరగంటపాటు మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 5.45 గంటలకు ప్రారంభమైన వర్షం అరగంటపాటు కురిసింది.

సమస్యలుంటే ధైర్యంగా పోలీసులకు తెలపండి

రాయదుర్గంటౌన్: స్కూళ్లు, కళాశాలల్లో ఏదైనా ఇబ్బందికర సమస్యలుంటే విద్యార్థినులు ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని యూపీఎస్ సీఐ జయనాయక్ తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, పట్టణ శివారులోని కేజీబీవీని సందర్శించారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. ముఖ్యంగా చిన్నారులు, బాలికలపై లైంగిక వేధింపుల అరికట్టేందుకు 'ఏది గుడ్ టచ్, ఏదీ బ్యాడ్ టచ్'పై అవగాహన ఉండాలన్నారు. హెచ్ఎం జయప్రదం, కేజీబీవీ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- డీఎంహెచ్ఓ ఈబీ దేవి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

రాయదుర్గంటౌన్: విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపైనా అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ ఈబీ దేవి తెలియజేశారు. శుక్రవారం పట్టణ శివారులోని కేజీబీవీని సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో బేటీ బచావో బేటీ పడావో, బాల్య వివాహాలు అనర్థాలు, పీసీపీఎ డీటీ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల తర్వాత సొంత కాళ్లపై నిలబడి తరువాత వివాహంపై ఆలోచించాలన్నారు. ఎక్కడైనా లైంగిక వేధింపులు ఉన్నట్లయితే ధైర్యంగా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అమ్మాయిల చదువుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదన్నారు. ఆ దిశగా అమ్మాయిలు తమ తల్లిదండ్రులను ఒప్పించాలని, లేనిపక్షంలో ఫిర్యాదు చేయాలన్నారు. రాజ్యాంగంలో బాలికల సంరక్షణకు కోసం నిర్దేశించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విస్తరణ అధికారులు త్యాగరాజు, గంగాధర్, వైద్యులు రాజేంద్రప్రసాద్, అజర్‌ఖాన్, మాధవ్ పాల్గొన్నారు.

పెన్నహోబిలం ఆలయ అభివృద్ధికి కృషి


పెన్నహోబిలం ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన సాకే రమేష్‌బాబు

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహుడి ఆలయాన్ని అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు తెలిపారు. ఉండబండ ఆలయ ఈఓగా పని చేస్తున్న రమేష్‌బాబు శుక్రవారం పెన్నహోబిలం ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఉదయం స్వామి పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఈఓగా బాధ్యతలు చేపట్టారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఇన్‌చార్జ్ జడ్జి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జడ్జి రమ్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం-1,2లో ఇన్‌చార్జ్ న్యాయమూర్తి రమ్య శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరాతీశారు. విద్యార్థులతో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

గర్భిణులు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలి

కూడేరు: గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే శిశువు ఎదుగుదల బాగుంటుందని వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ గర్భిణులను పరీక్షించి, వైద్య సేవలందించారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు ఇచ్చారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సుఖ ప్రసవం జరిగి, తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. తీసుకోవాల్సిన ఆహారంపై తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.